క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాలు



వలంటీర్లకు నియామక పత్రాలు ఇస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా వలంటీర్లు పని చేయాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆదేశించారు. బుధవారం 16 సచివాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న 25 మంది వలంటీర్ల పోస్టులను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. పుంగనూరును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వార్డు సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్వీటి కిశోర్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ విజయ్ థామస్

రామకుప్పం: మండలంలోని బల్ల పంచాయతీ అగ్రహారం దిన్నెకు చెందిన జ్యోతమ్మ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని స్థానిక సర్పంచ్ విజయ్ థామస్ ద్వారా మృతురాలి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ థామస్, సచివాలయ కన్వీనర్ రవి, బూత్ కన్వీనర్ చిన్నకాలప్ప, నేతలు అన్నామలై, కార్తీక్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కందుల పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగపద్మిని

గంగవరం: మండలంలోని మబ్బువారిపేట గ్రామ పరిసరాల్లోని వరి, కందులు, కూరగాయల పంటలను ఏడీఏ నాగపద్మిని (జిల్లా రిసోర్స్ సెంటర్), మండల వ్యవసాయాధికారిణి పద్మజ పరిశీలించారు. వరి పంటను తెల్లదీడ ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు పిచికారీ చేయవలసిన మందుల గురించి రైతులకు తెలియజేశారు. పంటలను చీడపీడల నుంచి కాపాడుకుంటే దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య శిబిరం రేపు

పుంగనూరు: స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా దివ్యాంగులకు(ప్రత్యేక అవసరాల పిల్లలు) వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ శిబిరాన్ని పుంగనూరు, చౌడేపల్లె, సోమల మండలాలకు సంబంధించి 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల వారికి ఉద్దేశించి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే వీల్‌చైర్, రోలేటర్, వినికిడి యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్, రేషన్ కార్డు, సదరన్ సర్టిఫికెట్ జెరాక్సులతోపాటు రెండు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

వి.కోట : నిమజ్జనానికి ట్రాక్టర్లతో తరలిస్తున్న వినాయకుని విగ్రహాలు



రొంపిచెర్ల : ఫజులుపేటలో.



బై..బై..గణేశా!

- నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత

పలమనేరు: పట్టణంలో వినాయకచవితికి ఏర్పాటు చేసిన మొత్తం విగ్రహాల్లో పలు విగ్రహాలు మూడో రోజైన బుధవారం నిమజ్జనానికి తరలాయి. పట్టణంలో మొత్తం 200 పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. శ్రీవాసవి కళ్యాణ మండలంలో తొలిసారి వినాయకుని విగ్రహాలను స్థానిక ఆర్యవైశ్య వినాయక చవితి కమిటీ ఏర్పాటు చేసి గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా లక్కీడిప్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా సుధీర్‌కుమార్ విచ్చేశారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. యువకులు వసంతాలు పోసుకుని ఉట్లోత్సవం నిర్వహించారు. తదుపరి విగ్రహాలను ట్రాక్టర్లపై కొలువుదీర్చి రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

బైరెడ్డిపల్లె: వినాయకచవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

వి.కోట: జైబోలో గణేష్ మహరాజ్‌కీ.. గణపతి బప్పమోరియా.. అంటూ భక్తుల నామస్మరణ, యువత కేరింతలతో పట్టణం మార్మోగింది. పట్టణంలో దాదాపు 15 చోట్ల ఏర్పాటు చేసిన వినాయ స్వామి విగ్రహాలను కోలాటాలు, డీజే డ్యాన్సులు, మేళతాళాల హోరు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, సిబ్బంది అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. అలాగే ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించారు. పట్టణంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తూ, యువత కోలాహలం నడుమ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి.

పుంగనూరు నియోజకవర్గం

అలరించిన డ్యాన్స్ హంగామా

చౌడేపల్లె: స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆవరణలో ఏర్పాటు చేసిన డ్యాన్స్, మ్యాజిక్ షో హంగామా కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ రోజుకో కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తులకు అలరిస్తోంది. దాదాపు 700 మందికి అన్నదానం చేసింది. అలాగే మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వినాయకుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

వేలంలో రూ.2.25 లక్షలు పలికిన లడ్డు

మండలంలోని పుదిపట్లలో వినాయక చవితి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన లడ్డును బుధవారం వేలం వేశారు. పుదిపట్ల సర్పంచ్ హారతి, చంద్రారెడ్డి దంపతులు లక్ష రూపాయలకు, అలాగే తిరుమణపల్లెలో నిర్వహించిన లడ్డు వేలంలో విశ్వనాథ రెడ్డి రూ.1.25 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. వీరిని గ్రామస్తులు సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు.

సదుం: మండలంలో బుధవారం వినాయక నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. దిగువ జాండ్రపేట, వాల్మీకివిధి, కాలేజీరోడ్డు, ఎంజేపీ గురుకుల పాఠశాల, కొత్తపల్లె తదితర చోట్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేసి ప్రసాదాలు పంచారు. ప్రత్యేక వాహనాల్లో మేళతాళాలతో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రొంపిచెర్ల: మండలంలోని ఫజులుపేట, పాత కురవపల్లె గ్రామాల్లో బుధవారం వినాయక స్వామి విగ్రహాలను బ్యాండు మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక నగర్‌లో నిర్వహించిన ఉట్లోత్సవంలో యువతీ యువకులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కూడా ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

కుప్పం నియోజకవర్గం

గుడుపల్లె: మండల వ్యాప్తంగా నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అగరంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని యువకులు డప్పు వాయిద్యాల మోత నడుమ రంగులు చల్లుకుంటూ, ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అలాగే ఇళ్ల నుంచి చిన్న చిన్న విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి తీసుకెళ్లారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద పూజలు చేసి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



సదుం : నిమజ్జనానికి తరలుతున్న గణపతి



పుదిపట్ల : లడ్డూవేలంలో దక్కించుకుని నిమజ్జనానికి తరలివెళ్తున్న దృశ్యం



గుడుపల్లె : అగరంలో..



వి.కోట : నిమజ్జనంలో భక్తుల సందడి



చౌడేపల్లెలో డ్యాన్స్ హంగామా



రొంపిచెర్ల : వినాయకనగర్‌లో ఉట్టి కొడుతున్న యువత



పలమనేరు : వాసవి కళ్యాణ మండపంలో..



పలమనేరులో..



పెద్దపంజాణి : రాయలపేటలో..



బైరెడ్డిపల్లె : ప్రతిమలను నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

థ్యాంక్యూ సీఎం సార్!



కల్లూరు చర్చిలో సమావేశమైన పాస్టర్లు

- గౌరవ వేతనమిచ్చి ఆదుకుంటున్నారని పాస్టర్ల కృతజ్ఞతలు

పులిచెర్ల(కల్లూరు): చర్చి పాస్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలనెలా రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తున్నారని, దీనికి తామంతా రుణపడి ఉంటామని కల్లూరు చర్చి పాస్టర్, చిత్తూరు జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ధనరాజ్ అన్నారు. బుధవారం కల్లూరు చర్చిలో పలు ప్రాంతాల పాస్టర్లు సమావేశమై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిది నెలల గౌరవ వేతనం ఒకే సారి తమ ఖాతాలో జమ చేశారని, ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా తమను ఇలా ఆదుకోలేదన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీయే అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ పాల్‌రాజ్, పాస్టర్లు శాంసన్, జాకబ్, రాజ్‌కుమార్, ప్రతాప్, టైటస్, దావీద్‌రాజ్, సంపత్, సువార్త సేవకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల తనిఖీ



ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం, బట్టందొడ్డి రైతు భరోసా కేంద్రాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి పంటలు, వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ-పంట నమోదు చేసిన పొలాలను సూపర్ చెక్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన అన్ని పంటలకు విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, ఏఓ రజీబా, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు దోహదం

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 37శాతం రిజర్వేషన్ కల్పించడంపై స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర హర్షం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యతతో రాష్ట్రంలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడం మూలాన మరెందరో మహిళలు రాజకీయంగా ముందుకెళ్లే అవకాశం లభించిందన్నారు. మహిళా సాధికారితకు ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

నేటి నుంచి యూరియా విక్రయం

పుంగనూరు: రైతు భరోసా కేంద్రాలలో గురువారం నుంచి నాగార్జున ఎరువుల కంపెనీకి చెందిన యూ రియాను రైతులకు విక్రయిస్తామని వ్యవసాయాధికారి రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. కొంతకాలంగా యూరియా కొరత ఉన్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన యూరియా రైతు భరోసా కేంద్రాలకు తెప్పించినట్లు తెలియజేశారు. గురువారం భీమగానిపల్లె, మోదుగులపల్లె, నేతిగుట్లపల్లె, చదళ్ల, పా శ్యెంపల్లె, పత్రపల్లె, మాగాండ్లపల్లె, సింగిరిగుంట , వనమలదిన్నె రైతు భరోసా కేంద్రాలలో బస్తా రూ. 267 చొప్పున విక్రయిస్తామన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

వి.కోట: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఉచిత ఉపకరణాల వైద్య శిబిరాన్ని బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. చిత్తూరు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వి.కోట, బైరెడ్డిపల్లె, రామకుప్పం మండలాల్లోని దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ ప్రభాకర్ వర్మ, ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడారు. వి.కోట భవిత కేంద్రంలోని నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం వివిధ ఉపకరణాలు, రోలేటర్, వీల్ చైర్, ట్రైసైకిల్, బ్రైలెస్ దివ్యాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హియరింగ్ ఎయిడ్స్ సహిత ఉపాధ్యాయులు అరుణోదయరాజ్, ఎంఈఓ-2 మురుగేష్ , బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పరుశురామ్, ఉపాధ్యాయులు నాగరాజు, గణేష్, నిర్మలకుమారి, ఫిజియో థెరపిస్ట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

'నారీశక్తి వందన్' అభినందనీయం



నారీశక్తి వందన్ చట్టంపై ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

పుంగనూరు: పార్లమెంటు, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రవేశపెట్టడం అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. రాబోవు కాలంలో చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి నారీశక్తి వందన్ చట్టం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మోర్చా నాయకులు అయూబ్‌ఖాన్, నాగరాజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నెమలిపై గజాననుడి కటాక్షం

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం మయూరంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉత్సవ విగ్రహాలకు మయూర వాహన సేవ ఉభయదారులు క్షీర కలశాలను శాస్త్రోక్తంగా ఊరేగింపుగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మయూర వాహన సేవ ఉభయదారుల కుటుంబ సభ్యులు కలసి క్షీర కలశాలను శివాలయం నుంచి కేరళ డ్రమ్స్, నాటికలు ప్రదర్శిస్తూ, మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో పాత నెమలి వాహనంతోపాటు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అర్చకులకు సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామివారి అలంకార మండపంలో ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారుల కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పౌరాణిక నాటకం, హరికథా గానం, భక్తి గీతాలు, భరతనాట్యం, సంగీతం భక్తులనే విశేషంగా ఆకట్టుకుంది.





ఉత్సవమూర్తులకు కర్పూర హారతి ఇస్తున్న ఆలయ అర్చకులు, పుర వీధులలో విహరిస్తున్న స్వామివారు

యాగమూర్తికి ప్రత్యేక పూజలు

ఆలయంలోని యాగశాలలో యాగమూర్తికి అర్చకులు శేఖర్ గురుకుల్ ఉదయం యాగశాలలో కొలువుదీరిన యాగమూర్తికి శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో ధ్వజస్తంభానికి విదేశీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా వాహన ఉభయదారులు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి దర్భ ఎందుకు?

ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజున ధ్వజస్తంభానికి చుట్టే దర్భమాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. భూత ప్రేత పిశాచ, రాక్షసాధిగణాలు దరిచేరకుండా దేవతలు నివాసముండేందుకు గాను దర్భమాలను, విడిదర్భలను ధ్వజస్తంభానికి చుట్టూ అలంకరిస్తారు. ఇది దోష నివారణకు ప్రధానమైన శాసనం. సర్వశుభాలు కలగడానికి ఒక మంగళ తోరణమని వైఖానస ఆగమం ఉపదేశం. విశిష్టమైన వనంలో సహజసిద్ధంగా పెరిగి, మంచిరోజు, తిథుల్లో నియమ నిష్ఠలతో పగటిపూట మాత్రమే కోసిన దర్భను మాత్రమే ఇందుకు ఉపయోగించాలని శాస్త్రవచనం. కాణికాక ఆలయ సిబ్బంది 20 రోజుల ముందు పరిసర అటవీ ప్రాంతాల్లో, సమీప గుట్టల్లో ఈ దర్భను సేకరించి 200 మీటర్ల పొడవు కలిగిన దారం(కొడితాడు), 6 అడుగుల వెడల్పు, అరున్నర మీటర్ల పొడవు కలిగిన చాప, 10 కిలోల విడిదర్భను గతవారం సమర్పించారు. అంకురార్పణ సందర్భంగా దర్భలను ధ్వజస్తంభానికి అర్చకులే అలంకరింప చేసి ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భక్తిప్రపత్తులతో ఆలయ కుంభాభిషేకం

గుడిపాల: మండలంలోని పెరుమాళ్లకుప్పం యానాది కాలనీలో బుధవారం వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కుంభాభిషేకానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. వేదపండితులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం పూజలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, టీటీడీ నిధులతో యానాది కాలనీలో వినాయకస్వామి దేవాలయం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ముందస్తు పూజ వినాయకస్వామికే అని ఇంతవరకు యానాదులకు గుడి లేకపోవడంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ దేవస్థానం రూ.10లక్షలతో వినాయకగుడి నిర్మించి కుంభాభిషేకం చేయడం ముదావహమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, వెంకటేశులు రెడ్డి, సాయిక్రిష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

పుంగనూరు: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆయుష్మాన్‌భవ కార్యక్రమంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రభుత్వాసుపత్రిలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్యసేవలు అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ మధుసూదనాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.